ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి

- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- నివాళులర్పించిన బీఆర్ఎస్

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 26 : కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని యావత్ ప్రపంచమే ఖండిస్తుండగా, ఇలాంటి చర్యలపై కేంద్రం కఠినంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. భారతీయులపై ఉగ్రదాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో కొవ్వొత్తులతో ర్యాలీ తీసి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సందర్భంగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, అమాయకులపై దాడులు జరపడం చాలా బాధాకరమన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామతీర్థపు రాజు, గోస్కుల రవి, క్రాంతి కుమార్, నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేశ్, సిరిగిరి రామచందర్, మల్లేశం, రవీందర్, దేవేందర్, వెంకట్ రెడ్డి, వెంకటేశం, అంజాత్ పాషా, అనిల్ కుమార్, కమలాకర్ రెడ్డి, హింగే కుమార్, సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

కదిలిన గులాబీ దండు

ట్రాఫిక్ జాం నేపథ్యంలో ముందస్తుగా పయణం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : నెత్తిన టోపి, చేతిలో గులాబీ జెండాతో పాతికేళ్ల బీఆర్ఎస్ పండుగకు దండు వడివడిగా కదిలింది. జిల్లాలోని దారులన్నీ ఎల్కతుర్తి వైపు అడుగు వేయగా, వేలాది మంది తరలి వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ జాంతో చేరుకోలేమంటూ సైన్యం ముందస్తు పయనమమైంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో రజతోత్సవ సభకు ఊరూ వాడా ఏకమై స్వచ్ఛందంగా తరలి వెళ్లింది. ఎల్కతుర్తిలో ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇరవై వేలకు పైగా జనం తరలి వెళ్తున్నారు. సభకు జన సమీకరణ చేసేందుకు కేటీఆర్ జిల్లాలోని ముఖ్య నాలయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ ఫోన్‌ద్వారా స్వయంగా మాట్లాడుతూ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సిరిసిల్లకు వచ్చి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు ప్రతి మండలం, గ్రామాల వారీగా సమావేశాలు పెట్టి సభను సక్సెస్ చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి సభకు రావాలని ఆహ్వానించారు. వాల్‌రైటింగ్స్, వాల్‌పోస్టర్లు, కరపత్రాలతో విస్తృత ప్రచారం చేశారు. అయితే, రోడ్లన్నీ గులాబీ వాహనాలతో ట్రాఫిక్ జాం అయ్యే అవకాశం ఉండడంతో పాటు నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. ఒక రోజు ముందే ఎల్కతుర్తికి చేరుకునేందుకు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి చాలా మంది శనివారం సాయంత్రమే ఎల్కతుర్తికి స్వచ్ఛందంగా వెళ్లారు. ప్రతి నియోజకవర్గానికి పదివేల మంది చొప్పున తరలించేందుకు వాహనాలను సమకూర్చారు.

ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, ఏప్రిల్ 26: ఎండలు తీవ్రతరం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వేణు మాధవ్ సూచించారు. మండల కేంద్రలోని పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ భారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనవంతవరకు నీడపట్టున ఉండాలని, అవసరమైతే తప్పా బయటకు వెళ్లకూడదన్నారు. ఎండ నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె వంటి వాటిని తీసుకోకూడదని సూచించారు.

రిమాండ్ ఖైదీ మృతి

విద్యానగర్, ఏప్రిల్ 26 : కరీంనగర్ జిల్లా జైల్లో ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న ఎండీ సాదుల్లా శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలానికి చెందిన సాదుల్లా ఒక ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరిని ఈ నెల 18న అరెస్ట్ చేసిన ముస్తాబాద్ పోలీసులు కరీంనగర్ జైలుకు రిమాండ్‌కు పంపించారు. అయితే శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో సాదుల్లా తనకు చాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో జైలు అధికారులు కరీంనగర్ జనరల్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అయితే చాతిలో నొప్పి ఎక్కువై శనివారం ఉదయం సాదుల్లా మృతి చెందాడు. మృతిపై కరీంనగర్ ఆర్డీవో మహేశ్ కుమార్ విచారణ జరిపారు. సాదుల్లాకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఊరూరా బీఆర్ఎస్ జెండా గద్దెలు సిద్ధం

- నేడు భారీగా తరలనున్న బీఆర్ఎస్ కార్యకర్తలు
- గ్రామాల్లో జెండాను ఆవిష్కరించిన అనంతరం చలో వరంగల్ సభకు వెళ్లనున్న కార్యకర్తలు

బొయినిపల్లి రూరల్ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బొయినిపల్లి రూరల్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా గద్దెల నిర్మాణం, పోస్టర్ విడుదల, గోడలపై రాతలు, జెండాల ఆవిష్కరణలతో పార్టీ శ్రేణులు బిజీబిజీ అయ్యారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రాహాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కతేరపాక కొండయ్య మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాల మేరకు హనుమ కొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ సభకు పంచాయతీల వారీగా బస్సులను కేటాయించి మండలం నుంచి 1500 మందిని తరలించాలని నిర్ణయించారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చే పార్టీ శ్రేణులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చెన్నడ అమిత్‌కుమార్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు అజ్జు, ప్రధాన కార్యదర్శి శంకర్, సుజన్, ఆనంద్ రెడ్డి, రాజు, కమల్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: బస్టాండ్‌లో తోరణాలతో ముస్తాబు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26 : చలో వరంగల్ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు.. గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా గద్దెలకు కొత్తగా రంగులు వేశారు. సభకు పెద్ద ఎత్తున్న జనసమీకరణ జరుగుతుండుగా, ఉదయం గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఆయా గ్రామాల అధ్యక్షుడు జెండాను ఆవిష్కరించిన అనంతరం వాహనాల్లో వరంగల్ సభకు బయలుదేరనున్నారు. నియోజకవర్గం నుంచి దాదాపు పదివేయిల

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26 : మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత పీఏ పెద్దూరి శ్రీనివాస్ తల్లి పెద్దూరి కనకవ్వ ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణు రావు, నాయకులు పరశురాం, శ్రీనివాస్, పొన్నం శేఖర్, మహేశ్, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో టీజీఐపాస్ అనుమతులు జారీ చేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, ఏప్రిల్ 26 : జిల్లాలో త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టీజీఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో జారీ చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో కలెక్టర్ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి, పరిశ్రమల స్థాపన, టీఎస్ఐ పాస్, టీ–ప్రైడ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో టీజీఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 27 ప్రతిపాదనల్లో 21 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జీఎం పరిశ్రమల శాఖ టీ హన్మంత రావు, టీజీఐపీ జోనల్ మేనేజర్ మహేశ్వర్, జిల్లా రవాణాఅధికారి లక్ష్మణ్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ డీ స్వప్న, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26 : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రాజప్రపుల్లా రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'భూ భారతి'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ, భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా గంథాలయ సంస్థ చైర్మన్ నాగులు సత్యనారాయణగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, ఆర్డీవో రాధాబాయి, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింగంగౌడ్, తహసీల్దార్ జయంత్, సంజీవ్ ఉన్నారు.

ఫ్లెక్సీలో ఫొటో వివాదం..

తంగళ్లపల్లిలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదాస్పదమైంది. తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఫొటోలు పెట్టగా, ఏకంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫొటో లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్లెక్సీలో ఆది శ్రీనివాస్ ఫొటోలేకపోవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇది ఇలా ఉండగా సమావేశంలో భూ భారతిపై పలు అనుమానాలు రైతులు వ్యక్తం చేయగా, వారిని కొందరు కాంగ్రెస్ నేతలు వారించి, తిప్పి పంపివ్వడం గమానార్హం. అవగాహన సదస్సులో కాంగ్రెస్ నేతల హల్‌చల్ కనిపించింది.

లింగంపల్లిలో బడిబాట

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని లింగంపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో కిషన్ హాజరైయ్యారు. అనంతరం గ్రామంలో ర్యాలీ తీసి బడిబాట కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయన్నారు. అన్ని రకాల వసతులు, ఉచితంగా మధ్యాహ్నభోజన వసతితో పాటు పుస్తకాలు, నాణ్యమైన విద్యను, వసతులను కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఊరడి రవి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేట, ఏప్రిల్ 26 : అక్రమంగా మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి పట్టుకున్నారు. వేములవాడలోని తిప్పాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు.. మంగళ్లపల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌కు ట్రాక్టర్లను తరలించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు ఎస్ఐ హెచ్చరించారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

వేములవాడ,ఏప్రిల్ 26: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నీరజను వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండ రవి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, సభ్యులు నాగుల సంపత్ కుమార్, పంపరి శంకరయ్య, గుజ్జె మనోహర్, కనికరపు శ్రీనివాస్, కనపర్తి రాజశేఖర్, జక్కుల పద్మ, బూర సరిత, ఉన్నారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యుడికి గిరిజనతండా నాయకుల సన్మానం

రుద్రంగి, ఏప్రిల్ 26 : మండలంలోని బడితండా గ్రామానికి చెందిన అడ్వకేట్ గుగులోత్ బలరాం నాయక్ కరీంనగర్ బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎన్నిక కావడంతో శనివారం మాజీ సర్పంచ్‌లు, గిరిజనతండా నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజనతండా నాయకులు మాట్లాడుతూ, బడితండాకు చెందిన అడ్వకేట్ గుగులోత్ బలరాం నాయక్ కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యులు ఎన్నిక కావడంతో అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్‌లు మంగిలాల్, రమణయ్య, నాయకులు రందాస్, భూమానాయక్, భూపతి పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26: అదనపు కట్నం కోసం భార్యను వేధించినందుకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. శనివారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గుండారంకు చెందిన గుగులోత్ మేరీని బుగ్గరాజేశ్వర తండాకు చెందిన అనిల్‌తో ఆరేండ్ల క్రితం వివాహం జరిగింది. పెల్లయిన రెండు నెలల వరకు బాగానే చూసుకున్నప్పటికీ అటుపిమ్మట అదనపు కట్నం కోసం వేదింపులకు గురి చేయగా, గతంలో ఓ సారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అనిల్ తన భార్యను బాగా చూసుకుంటానని తీసుకెళ్లాడు. తిరిగి అదే విధంగా వేదింపులకు గురి చేస్తూ ఈ నెల 25న రాత్రి కట్నం కోసం కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టినట్లు మేరీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నేరాలను నియంత్రించాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 26 : నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణంలో వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఏఎస్పీ కార్యాలయం ద్వారా మానిటర్ చేయడం మంచి విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి శేషాద్రిని రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, ఆలయ ఈవో వినోద్ రెడ్డి, పట్టణ సీఐ వీర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వేములవాడ : ఉగ్ర దాడికి నిరసనగా వేములవాడలో మూసి ఉన్న దస్తావేజు లేఖరుల కార్యాలయాలు

రుద్రంగి : ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఉగ్రవాద మూలాలను తుదముట్టించాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు

వేములవాడ, ఏప్రిల్ 26 : దేశంలో ఉగ్రవాద మూలాలను పూర్తిగా తుడిచి పెట్టేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు డిమాండ్ చేశారు. భారతీయులను ఉగ్రవాదులు కాల్చి చంపడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను శనివారం వేములవాడ పట్టణంలో దగ్ధం చేశారు. వేములవాడ పట్టణ సీపీఐ కార్యదర్శి పొశెట్టి, రూరల్ మండల కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, పెంట మల్లయ్య, బొంబాయి లక్ష్మణ్, శ్రీనివాస్, శేఖర్ ఉన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ దస్తావేజు లేఖరుల నిరసన

వేములవాడ, ఏప్రిల్ 26 : ఉగ్రదాడిని నిరసిస్తూ వేములవాడ దస్తావేజు లేఖరులు శనివారం కార్యాలయాలను మూసివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖరుల అధ్యక్షుడు చేట్టిపల్లి మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కిషన్, రాజయ్య, కల్లపెల్లి శేఖర్, లింగాల సుదర్శన్, నాగరాజు, సంతోష్ , క్రాంతి, భరత్, జలెందర్, సృజన్, వినయ్, మహేశ్ ఉన్నారు.

రుద్రంగిలో శాంతియుతంగా బంద్

రుద్రంగి, ఏప్రిల్ 26 : టెర్రరిస్టులు టూరిస్టులను కాల్చి చంపడాన్ని ఖండిస్తూ, చనిపోయిన వారికి సంఘీభావంగా హిందూ సంఘాలు, ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రుద్రంగికి బంద్‌కు పిలుపునివ్వగా వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి, చనిపోయిన వారికి నివాళులర్పించారు. నాయకులు గంగం మహేశ్, నంద్యాడపు వెంకటేశ్, దయ్యాల కమలాకర్, కంటె రెడ్డి, పడాల గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్ : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గోర్ బంజారా నాయకులు

ఉగ్రవాదుల దాడి అమానుషం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 : పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని సిరిసిల్ల గోర్ బంజారా నాయకులు అన్నారు. ఈ మేరకు గోర్ బంజారా ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం దాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. భూక్యా రాజు నాయక్, అజ్మీర రాములునాయక్, భూక్యా గజన్‌లాల్‌నాయక్, హజునాయక్, లవావత్ మోతిలాల్‌నాయక్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని రుద్రవరం గ్రామంలో చేపలు పట్టే లైసెన్స్‌దారులకు జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మధ్య మానేరు జలాశయం పరిధిలోని లైసెన్స్ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా అంశాలను చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్‌దారులు విధిగా ఏటా సెప్టెంబర్ మొదటి రోజు నుంచి రెన్యువల్, నూతన లైసెన్స్‌ను సంబంధిత రుజువులు జతపరచి, లైసెన్స్ రుసుం మత్స్యశాఖకు చెల్లించి కొత్తగా లైసెన్స్ లేదా రెన్యువల్ చేసుకోవాలన్నారు. జిల్లా మత్స్య శాఖ పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు రాము, జిల్లా డైరెక్టర్స్, లైసెన్స్‌దారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయ సాగుతో లాభాలు

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

రుద్రంగి, ఏప్రిల్ 26: పంట మార్పిడికి కొందరు రైతులు ముందుకొస్తున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టిసారిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా. సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు వేస్తున్నారు. వరి, పత్తి, మక్క పంటలతో లాభాలు తక్కువ గ్రహించి.. వేసవిలో సీజన్‌కు అనుగుణంగా పుచ్చకాయ పంట వేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటలకు అధికంగా డిమాండ్ ఉండడంతో సాగుకు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో పుచ్చకాయ సైజును బట్టి 20 నుంచి 50రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

పుచ్చకాయ పంట

పంటకు మంచి డిమాండ్ ఉన్నది

నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. ఎకరం నరలో పుచ్చకాయ, 20గుంటల్లో దోస, క్యారెట్, రెండెకరాల్లో వరి పంట వేసిన. పుచ్చకాయ సాగుకు ఇప్పటి వరకు రూ.45వేల వరకు ఖర్చయింది. దాదా పు 250–300 వరకు క్వింటాళ్ల దిగుబ డి వస్తదని అనుకుంటున్న. ఇప్పటి వరకైతే చేను మంచిగున్నది. స్వయంగా అమ్మితే లాభం ఎక్కువగా ఉంటుంది.

– నాగులపెల్లి రవి, రైతు (రుద్రంగి)

మట్టిలో మాణిక్యం

- జాతీయ స్థాయి ఖ్యాతి.. యువతకు స్ఫూర్తి
- ఉచిత కోచింగ్.. క్రీడా నైపుణ్యం పెంపు
- శభాష్.. మునీందర్ రెడ్డి

జాతీయ పోటీల్లో పాల్గొన్న చింతలపల్లి మునీందర్ రెడ్డి

చందుర్తి, ఏప్రిల్ 26 : కమర్షియల్‌గా మారిన ప్రస్తుత జీవనంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు జాతీయ క్రీడాకారుడు మునీందర్ రెడ్డి.. తాను నేర్చిన విద్యను ఉచితంగా అందిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ స్ఫూర్తి నింపుతున్నారు. వ్యవసాయం చేస్తూ యువత పెడదోవ పట్టకుండా సన్మార్గంలో నడుపుతున్నారు. మారుమూల ప్రాంతం.. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న మండలంలోని బండపల్లి గ్రామం ఇప్పుడు విద్యావంతులకు చిరునామాగా నిలుస్తోంది. క్రీడాకారులకు నెలవవుతోంది. గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు చింతలపల్లి మునీందర్‌రెడ్డి ఎలాంటి శిక్షణ లేకుండా స్వతాహగా నేర్చుకొని కాకతీయ యూనిర్సిటీ పరిధిలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అథ్లెటిక్స్‌లో హ్యాట్రిక్ అవార్డులు పొందారు. 1998లో బీఏ, బీఈడీ పూర్తి చేయగా, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఊళ్లోనే వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో నేర్చుకున్న విద్య వృథా కాకుండా ఉచితంగా శిక్షణనిస్తున్నాడు. బండపల్లి, బావుసాయిపేట, జోగపూర్ గ్రామాల విద్యార్థులు, యువతకు అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్పుతున్నారు.

ఉచిత శిక్షణ.. రాష్ట్రస్థాయిలో ప్రతిభ

మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న మునీందర్ తనలా క్రీడాకారులను తీర్చిదిద్దారు. సుమారు 20 మంది రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి ప్రాంతాలతో పాటు కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతభ చూపారు. పలువురు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మునీందర్ రెడ్డి

ప్రచారం చేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

అధ్యాపకుల ఇంటింటా ప్రచారం

మెట్‌పల్లి, ఏప్రిల్ 26: మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ప్రిన్సిపాల్ డా.వెంకయ్య, లెక్చరర్లు శనివారం మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేటలో ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కళాశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, కళాశాలలో ప్రవేశం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవన్న, మనోజ్‌కుమార్, అంజయ్య, గట్టయ్య పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనపై గుంతలు పూడ్చండి

కోనరావుపేట, ఏప్రిల్ 26: మండలకేంద్రానికి సమీపంలో ప్రధాన రోడ్డుపై ఉన్న లోలెవల్ వంతెనపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కాగా, అధికారులు గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లోలెవల్ వంతెనపై ఏర్పడిన గుంతలు